
# ఆ తండ్రీ కొడుకులు




సి.హెచ్. శాంతాదేవి

"**బాబూ,** ఇంకా నిద్రపోలేదా, అమ్మా?"

పార్వతి బెడ్ రూమ్‌లోకి వచ్చింది.

బాబు బొమ్మల పుస్తకం తిరగేస్తున్నాడు మంచమీద కూర్చుని. గడియారం పది గంటలు చూపిస్తోంది.

"పడుకోవమ్మా! పొద్దుపోయింది" దోమతెర సరి చేస్తూ అంది.

"నాన్నగారింకా రాలేదేమమ్మా?"

"ఇవాళ ఆలస్యంగా వస్తానని చెప్పారుగా!"

"నాకు చాక్‌లెట్లు తెస్తానని చెప్పారు. నాన్నగారొస్తే నన్ను లేపటం మర్చిపోకేం?" ఆవలిస్తూ దిండు మీదికి ఒరిగాడు.

పార్వతి మాట్లాడకుండా వాడికి దుప్పటి కప్పింది.

వాడు కళ్ళు మూతలు పడుతుంటే బలవంతాన పెగుల్చుకుంటూ,

"అమ్మా! నాన్నగారొచ్చాక తప్పకుండా లేపు" అంటూ నిద్రలోకి జారాడు.

పార్వతి గది తలుపు దగ్గరగా చేరవేసి ముందు హాల్లోకి వచ్చి కూర్చుంది.

గడియారం ముళ్ళు కదుల్తున్నాయి.

నిమిషాలు లెక్కపెట్టుకుంటూ ఇలా ఎన్ని గంటలు గడపాలో ...

పార్వతికి నిద్ర రావటం లేదు.

ఆకలిలేదు. భర్తరాకకోసం ఎదురుచూస్తూ కునికిపాట్లు పడుతూ అలాగే కూర్చుంది.

హఠాత్తుగా పార్వతి ఉలిక్కిపడి లేచింది.

ఒక్క క్షణం అయోమయంగా చుట్టూ పరిసరాలు గమనించింది.

తలుపులు దబదబ బాదుతున్న చప్పుడు.

అవును. ఆయన వచ్చేసినట్టున్నారు.

పార్వతి కంగారుగా తలుపు తీసింది.

ఎదురుగా చలపతి...

కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి.

పార్వతి తలవంచుకుంది తప్పు చేసిన దానిలా.

"బుద్ధిలేదూ? ఎంతసేపని వాకిట్లో చావమంటావు?" బిగ్గరగా అరిచాడు.

విసురుగా లోపలికి వచ్చాడు.

"అన్నం పెట్టనా?"

చొక్కా విప్పుతూ పార్వతికేసి తీవ్రంగా చూశాడు.

"నా శార్ధం పెట్టు ..."

పార్వతి అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

డైనింగ్ టేబిల్ మీద అన్నీ సర్దింది.

చలపతి ఏదో గొణుక్కుంటూ వచ్చి కూర్చు న్నాడు.

"ఛీ ... ఛీ ... కొంపకొస్తే ఏ సుఖమూలేదు శాంతి లేదు. ఎప్పుడూ ఏడుపుమొహం..."

పార్వతి మాట్లాడకుండా నిలబడింది.

"మొగుడు వెధవ ఇంటికి వస్తాడన్న జ్ఞానమేమైనా ఉందా? ఏమిటే తిండి?" కంచం విసురుగా తోశాడు.

పార్వతి కళ్ళల్లో నీళ్ళు చెంపల మీదకు జారాయి.

"నేను చచ్చినప్పుడు ఏడుద్దువు గాని ... ఇప్పుడెందుకు?" తూలుకుంటూ పడగ్గదిలోకి నడిచాడు.

పార్వతి చెల్లాచెదురుగా పడి ఉన్న అన్నం మెతుకుల్ని చూస్తూ అలాగే నిలబడింది చాలాసేపు.

ఆమెకు బాబు మాటలు గుర్తుకు వచ్చాయి.

"అమ్మా! నాన్నగారు రాగానే నన్ను నిద్ర లేపమ్మా."

పార్వతి బాబు పక్కన పడుకుంది.

ఒక రోజు గడిచింది. ... ఆవేదనగా కళ్ళు మూసుకుంది. మూసుకున్న రెప్పల నుండి నీళ్ళు జారి దిండులోకి ఇంకిపోయాయి.

● ● ● ●

ఉదయమే చలపతి కాఫీ త్రాగి వరండాలో పేపరు చదువుతూ కూర్చున్నాడు.

బాబు నిద్ర లేచాడు.

తండ్రి దగ్గరకు వెళ్ళి ఒడిలో కూర్చున్నాడు.

"హలో ... గుడ్‌మార్నింగ్ ఆర్ యూ?"

"నాన్నా ... చాక్‌లెట్లు తెచ్చావా?"

"ఓ ... నీ కివ్వలేదు గదూ? ఇప్పుడే ఇస్తాను పారూ ... బాబుకి బోర్నవిటా, నాకు కాఫీ ... అర్జంట్ ..."

పార్వతి ఇద్దరికీ చెరో గ్లాసు అందించింది.

"బాబూ! అమ్మకి బొత్తిగా మానర్స్ తెలియదు. మనిద్దరికీ ఇచ్చింది గానీ తను తీసుకోలేదు" అని స్వయంగా తను లోపలకు వెళ్ళి ఖాళీ గ్లాసు తీసుకొచ్చి తన గ్లాసులో కాఫీ సగం పంచి ఆమె కందించాడు.

"షేక్స్ ... షేక్స్ ..." భార్య మొహంలోకి చిలిపిగా చూశాడు.

పార్వతి నవ్వింది.

పార్వతి కాఫీ తాగుతూ అతని మొహంలోకి చూస్తోంది.


అతను నిర్మలంగా నవ్వుతున్నాడు.

అతని కళ్ళు స్వచ్ఛంగా ఉన్నాయి.

పార్వతి నిట్టూర్చి వెనక్కి తిరిగి లోపలకు వెళ్ళిపోయింది.

ఆ రోజు చలపతి సరదాగా మాట్లాడుతూ ఆమెకి వంటలో సాయం చేశాడు.

బాబుని స్కూల్లో దింపాడు.




ఇంటికి వచ్చి "ఈ రోజు నేను ఆఫీసుకు వెళ్ళను" అన్నాడు.

పార్వతి చదువుతున్న పుస్తకం మూసివేస్తూ, "ఎందుకని?" అని ప్రశ్నించింది.

"ఇంట్లో ముఖ్యమైన పని ఉంది. అందుకని..." కొంటెగా ఆమె మొహంలోకి చూస్తూ గది తలుపులు వేశాడు.

పార్వతి నిర్లిప్తంగా చూస్తోంది.

ఆమె మొహంలో ఏ భావమూ లేదు.

"ఎందుకు పార్వతీ, అలా డల్‌గా ఉన్నావు?" ఆప్యాయంగా ఆమెని దగ్గరకు తీసుకున్నాడు.

పార్వతి జవాబివ్వలేదు.

అతని ప్రశ్నకి సమాధానం ఆమె వద్ద లేదు.

● ● ● ●

"ఏమిటిది? మనుషులు కాపరం చేసే ఇల్లేనా?" చలపతి లోపలకు వస్తూనే అరిచాడు.

పార్వతి అన్నింటికీ అతీతురాలిలా అతన్ని చూస్తూ నిలబడింది.

"దిష్టి బొమ్మలా నిలబడకపోతే అన్నం తగలేయరాదూ?"

పార్వతి కీ యిచ్చిన బొమ్మలా చకచకా వడ్డించింది.

అన్నం తింటున్నంతసేపూ అరుస్తూనే ఉన్నాడు.

పార్వతిలో సహనం రోజు రోజుకీ సన్నగిల్లుతూంది. ఇందుకు పరిష్కారమార్గం ఆమెకు తోచటం లేదు.

ఉదయం మళ్ళీ మామూలు ...

"పార్వతీ! ఈ రోజు స్పెషల్‌గా ఏదైనా చెయ్యాలోయ్ ... వంటలో నీ ప్రావీణ్యం నాకు తెలియంది కాదనుకో. అయినా శలవు రోజుకదా!"

పార్వతి మొహంలో అత నూహించిన సంతోషం కనిపించలేదు. ఆమె అతనిలో ఇద్దరు మనుషుల్ని చూస్తోంది. ఒకరికీ, మరొకరికీ పోలిక లేదు... ఈ రెండు మనస్తత్వాల్ని సమన్వయ పరుచుకుని సర్దుకు పోవాలని ప్రయత్నిస్తూంది. ఈ ప్రయత్నంలో ఆమెకి జీవితకాలం అంతా సరిపోయేట్టుగా ఉంది.

పగలు అంత మనిషి ఉండడు.

రాత్రులు అంత రాక్షసత్వం మరెవరిలోనూ చూడదు పార్వతి.

"పడుకో, బాబూ! మళ్ళీ ఉదయమే లేవాలి..."

బాబు ఆ రోజు మొండికేశాడు.

"ఏమైనా సరే, ఈ రోజు నాన్నగా రొచ్చేదాకా నిద్రపోను ..."

పార్వతికి ఏం చెయ్యటానికీ పాలు పోలేదు.

"నాన్నగా రొస్తే నేను లేపుతాగా! నువ్వు పడుకో." బ్రతిమాలింది.

బాబు ససేమిరా వినక అలాగే కూర్చున్నాడు.

చలపతి వచ్చేవేళ దాటిపోతూంది.

బాబు కళ్ళు మూతలు పడుతున్నాయి. వాడు నిద్ర ఆపుకోలేక పోయాడు.

... కలత నిద్రలో బాబు ఉలిక్కిపడి లేచాడు.

ఎక్కడో అరుపులు ... ఏడుపు.

బాబు శ్రద్ధగా ఆలకించాడు.

వాడి పన్నెండేళ్ళ వయసులో అమ్మా, నాన్నా నవ్వుతూ ఉండటమే చూశాడు గానీ, ఈ కొత్త వ్యక్తుల్ని వా డెరుగడు. అందుకే భయంతో కళ్ళు తెరవకుండా అలాగే పడుకున్నాడు.

.... తెల్లవారి లేస్తూనే అమ్మ మొహంలోకి పరీక్షగా చూశాడు.

ఆ మొహం ఎప్పటిలా ప్రశాంతంగా ఉంది.

చిరునవ్వుతో బాబుని దగ్గరకు తీసుకుంది.

బాబు ఆలోచిస్తున్నాడు.

రాత్రి అమ్మ ఏడిచింది. నాన్న అరిచాడు. ఇదంతా నిజంగా జరిగిందా? తనకి కలగాని వచ్చిందా ...

"బాబూ ... గుడ్ మార్నింగ్ ...ఈ రోజు పిక్చర్‌కి వెడదామన్నావుగా! సాయంత్రం త్వరగా వచ్చేస్తాను ..."

బాబు తండ్రి మొహంలోకి చూసాడు.

చలపతి నవ్వుతున్నాడు నిష్కల్మషంగా ...

రాత్రి తనకు కల వచ్చిందని బాబు నిశ్చయించుకున్నాడు.

● ● ● ●

..."పార్వతీ... ఓ పార్వతీ ... ఎక్కడ చచ్చావ్?" గావుకేకలు వేసుకుంటూ లోపలకు వచ్చాడు చలపతి.

నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్న బాబు బిగుసుకు పోయిన ట్టయ్యాడు.

నాన్నేనా అలా మాట్లాడేది? ...

తండ్రి అట్లా మాట్లాడతాడంటే వాడి పసి

మనసుకి నమ్మ బుద్ధికావటం లేదు.

కానీ, వాడి వూహల్ని తారుమారుచేస్తూ చలపతి ఇంకా అరుస్తూనే ఉన్నాడు.

పార్వతి ఏడుస్తూ ఏదో అంటోంది.

విసురుగా కంచం తోసిన చప్పుడు ...

తర్వాత నిశ్శబ్దం ...

చాలాసేపటికి అమ్మ వచ్చి తన పక్కన పడుకోవటం చూస్తూనే ఉన్నాడు బాబు.

చేతులు మొహానికి అడ్డం పెట్టుకుని వేళ్ళ సందుల్లోంచి చూశాడు.

అమ్మ ఏడుస్తోంది ...

ఎప్పుడూ నవ్వుతూ, హుషారుగా ఉండే అమ్మ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

బాబుకి దిగులుగా అన్పించింది...

వాడు రాత్రి నిద్రపోలేదు.

అమ్మ వంకే చూస్తూ పడుకున్నాడు.

అమ్మ ఏడుపే గుర్తుకు వస్తోంది.

తెల్లారి బాబు మొహం పీక్కుపోయి ఉంది. తల్లి దగ్గరకు చనువుగా వెళ్ళలేక పోయాడు.

పార్వతి అదేమీ పట్టించుకోలేదు.

మామూలుగా పని చేసుకుంటోంది.

బాబు ఆ రోజంతా అన్య మనస్కంగా గడిపాడు. స్కూల్లో పాఠం వినక మొదటి సారి టీచర్ చేత దెబ్బలు తిన్నాడు. అయినా వాడికి బాధనిపించలేదు. రాత్రి అమ్మ వెక్కివెక్కి ఏడవటం గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసులో గుబులుగా ఉంటోంది.

సాయంత్రం పిల్లలతో ఆడుకోకుండా చెట్లమధ్య సిమ్మెంట్ బెంచీ మీద ఒంటరిగా కూర్చున్న బాబుని చూసి పార్వతి ఆశ్చర్యపోయింది.

'ఏమ్మా! ఆడుకోవటానికి వెళ్ళలేదేం?"

దుఃఖం ఉప్పెనలా ముంచుకు వస్తోంది బాబుకి.

అయినా బిగబట్టుకుని తల అడ్డంగా వూపాడు వెళ్ళనన్నట్టు.

పార్వతి ఇంకేం ప్రశ్నించలేదు.

● ● ● ●

... గదిలోకి వెళ్ళి చలపతి తలుపులు మూసుకున్నాడు.

పార్వతి వంటిల్లు సర్దుతోంది.

బాబు చదువుకునే గదిలో పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు. వాడి మనసు చదువు మీద లేదు.

గదిలో నాన్న ఏం చేస్తున్నాడన్నదే వాడి ఆలోచన.

మెల్లిగా లేచాడు.

వంటింట్లో కెళ్ళాడు అమ్మ ఏం చేస్తోందా అని.

పార్వతి ఏదో సర్దుతూ వెనక్కి తిరిగి చూడలేదు.

బాబు తండ్రి గది ముందుకు వెళ్ళాడు.

అమ్మ వస్తుందేమోనని భయంగా ఉంది.

మెల్లిగా కిటికీ ఎక్కి లోపలికి తొంగిచూశాడు.

అక్కడ వాడికి విచిత్రమైన దృశ్య మేమీ కనిపించలేదు.

చలపతి సీసాలోది గ్లాసులోకి వంచుతున్నాడు.

మెల్లిగా ఒక్కో గుటకా వేస్తున్నాడు.

బాబు అలాగే చూస్తున్నాడు.

చలపతి గ్లాసులోది పూర్తిచేసి మళ్ళీ వంచుకున్నాడు.

బాబు మెల్లగా అక్కణ్ణించి వచ్చేశాడు.

వాడికి ఆ రాత్రి చదువు సాగలేదు.

తండ్రి తాగే దేమిటా అని ఆలోచిస్తున్నాడు వాడు.

● ● ● ●

బాబులో మార్పు మొదట కనిపెట్టింది పార్వతి. పూర్వంలా అల్లరి చేయక పోవటం, స్నేహితులతో తిరగటం మానేసి ఇంట్లోనే ఉండటం ... వయసుకి మించిన గాంభీర్యంతో ప్రవర్తిస్తున్న వాణ్ణి చూసి భయపడింది పార్వతి.

భర్తతో చెప్పింది.

తేలిగ్గా కొట్టి పారేశాడు అతను...

"పసి వెధవ వాడికి ఆలోచన లేమిటి" అన్నాడు.

పార్వతికి తృప్తి కలగలేదు.

వాడి చిన్న మనస్సుని అంతగా గాయపరచిన సంఘటన ఏమై ఉంటుందా అని ఆలోచించింది.

ఆ రోజు రాత్రి మళ్ళీ అమ్మని తిట్టడం ... అమ్మ ఏడవడం చూశాడు వాడు. అప్పుడప్పుడు నాన్న గది తలుపులు మూసుకోవటం కూడా చూస్తూనే ఉన్నాడు. లోపల తండ్రి చేసే పని ఏమిటో తెలుసుకున్నాడు. ఏదో సీసాలోది రోజూ తాగుతున్నాడు. ఆ విషయాన్ని అమ్మ పెద్దగా పట్టించుకోవటం లేదు. మరింత ఆశ్చర్యంగా ఉంది వాడికి,

... ఒక రోజు ...

చలపతి మామూలు ప్రకారం గదిలోకి వెళ్ళి మరుక్షణం పార్వతిని కేకేశాడు.

"పిలిచారా?"

"ఆఁ ... ఇక్కడ సీసా పెట్టాను తీశావా?"

"నే నెందుకు తీస్తాను?"

"మరయితే ఏమైనట్టు?"

"ఏమో! ఇంకెక్కడయినా పెట్టారేమో!"

చలపతి ఎక్కువగా తర్కించలేదు.

కానీ తర్వాత రెండు మూడుసార్లు తను పెట్టిన చోట సీసాలు ఉండకపోవటం చూసి అతను వూరుకోలేక పోయాడు.

అతను పార్వతిని గదమాయించి అడిగాడు.

నాకేం తెలియదంటూ పార్వతి కన్నీళ్ళు పెట్టుకుంది.

చలపతికి అర్థం కాలేదు ఈ విచిత్రం...

... ఒక రోజు చలపతి ఇంటికి వచ్చి భార్యని పిలిచాడు.

"త్వరగా బయల్దేరితే పిక్చరుకు వెడదాం. ఇవాళే ఆఖరు ఇరోజు ..."

పార్వతి త్వరగా పనులు కానిచ్చుకొని బాబుకోసం చూసింది. వా డెక్కడా కనిపించలేదు.

పక్కింటికి వెళ్ళి చూసింది.

వాళ్ళూ లేదన్నారు.

పార్వతి కంగారుగా భర్త దగ్గరకు వచ్చి,

"బాబు లేడు. ఎటువెళ్ళి ఉంటాడో?" అని అడిగింది.

చలపతికి భయం వేసింది.

"ఇంట్లో వాణ్ణి ఎప్పుడు చూశావు? వాడి సంగతి పట్టించుకోకుండా ఏం చేస్తున్నావు?" అన్నాడు కష్టంగా.

పార్వతికి భయంగా ఉంది.

చెప్పకుండా ఎక్కడికి వెళ్ళి ఉంటాడు?

చీకటి పడింది...

ఇద్దరూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు.

బాబు రాలేదు.

చలపతి ఇక ఆగలేక పోయాడు.

ఇద్దరూ ఇంటికి తాళం వేసి బయల్దేరారు.

దుకాణాల్లో, రోడ్డు మీద నడుస్తున్న జనంలోనూ పరిశీలనగా చూసుకుంటూ నడుస్తున్నారు.


ఎదురుగా ఉన్న పార్కులోకి ప్రవేశించారు.

ఇద్దరూ వెతుకుతున్నారు.

ఒక బెంచీ మీద ముడిచి పెట్టుకుని పడుకుని ఉన్న బాబుని చూసి పార్వతి కెవ్వున కేక పెట్టింది.

"బాబండీ ... మన బాబేనండీ ...!"

ఇద్దరూ పరుగున వెళ్ళారు.




అక్కడి దృశ్యం చూసి ఇద్దరూ నిశ్చేష్టులై శిలా విగ్రహాల్లా నిలబడిపోయారు.

పార్వతి తలయెత్తి భర్త మొహంలోకి చూసింది.

చలపతి అయోమయంగా చూశాడు భార్యవేపు.

బాబు వళ్ళు తెలీకుండా ఆ సిమ్మెంటు బెంచీ మీద పడుకుని ఉన్నాడు ... వాడి పక్కనే ఖాళీ విస్కీ బాటిల్ పడి ఉంది.

చలపతికి కడుపులో దేవినట్లయింది.

మెల్లిగా బాబుని లేవదీసి ఎత్తుకున్నాడు.

అడుగులు ముందుకు వేశాడు.

అతని మొహం చూస్తే పార్వతికి ఆ క్షణంలో నిజంగా జాలేసింది.

మెల్లిగా అతని చేయిమీద చేయివేసి నిమిరింది.

ఆ స్పర్శ అతని కేదో సందేశాన్ని చాటిచెప్పినట్టయింది.

పెద్దవాళ్ళ ప్రవర్తన పిల్లల సున్నితమైన మనసు మీద ఎంత బలంగా ముద్ర వేసుకుపోతుందో ఆ భార్యా భర్త లిద్దరూ గ్రహించారు. ★